
ఈ వారం కథ

# ఎప్పుడో నేతగాళ్ళ రాజ్యం

బుద్ధి యజ్ఞమూర్తి



పెం..... దళాడే పక్కమీంచి లేవాలంటే మహా బద్ధకం నాకు. నాన్న ఏమీ అనేవాడు కాదు కానీ అమ్మ మాత్రం నడుం మీద ఒక్కటేసి లేపేసేది. ఎంత కోపం వొచ్చేదో అప్పుడు అమ్మ మీద. వాళ్ళిద్దరూ అయిదున్నరకే లేచేవోళ్ళు. నాన్న చెంబు తీసుకుని రైలు కట్టకాడి కెళ్ళి వొచ్చేలోగా అమ్మ వాకిలీ, దడ్డీ వూడ్చి మగ్గాలోకి వెళ్ళేది. వెళ్ళే ముందు నన్ను లేపేది, చదువుకునేందుకు. ఎప్పుడో కాని నాకు కండెలు చుట్టమని కానీ, లడ్డీలు తోడమని కానీ చెప్పేది. నేను బాగా చదువుకుని ఉద్యోగం చెయ్యాలని అమ్మ కలలు కంటూ ఉంటుంది. 'మగ్గం గుంట బతుకు నీకు రాకూడదురా' అని వారానికోమారన్నా అనేది నాతో.

నాకప్పుడు చదువు మీద కంటే ఆటల మీదనే ధ్యాసెక్కువ. సన్నగా రివటలా ఉండేవాణ్ణిలే అప్పుడు. చెవ్వాట, ఒంగుళ్ళు దూకుళ్ళు ఆటలంటే మా ఇష్టం నాకు. సాయంకాలం బళ్ళోంచి ఇంటికొచ్చి పుస్తకాలు అట్టా పడేసి ఇట్టా తుర్రుమనే వాణ్ణి బయటకి. అమ్మ అరుస్తున్నా లెక్క పెట్టేవోణ్ణి కాదు. ఒకసారైతే ఒంగుళ్ళు దూకుళ్ళు ఆడుతూ వుంటే నేను వీపు మీద చేతులేసి దూకేప్పుడు మా అన్న (పెదనాన్న కొడుకు) నన్ను పడేయాలని దభీమని కూచున్నాడు. వాడు వొంగుని వుంటాడనే ఉద్దేశంతో నేను దూకేను. ఏముంది పట్టు దొరక్క అట్టాగే ఇసుకలో బోర్లా పడ్డా. నోట్లో, ముక్కులో ఇసుక పోయి ఉక్కిరిబిక్కిరయ్యా. కళ్ళల్లో కూడా కొంచెం పడింది. అప్పుడు చూడాలి సామి రంగా నా అవస్థ. నేను ముక్కులో యేళ్ళు పెట్టి ఇసుక తీసుకునేప్పుడు నా కోసం ఎతుకుతా వొచ్చిన అమ్మ చూడనే చూసింది. నేను గింజుకుంటున్నా యిడవకుండా 'నీకు చదూవొద్దు. చట్టి బండలూ వొద్దు. యిక నుంచీ మగ్గం దగ్గిరే వుండు' అని నాలుగు తగిలించేసింది. దాంతో నాకు భయం వేసింది - నిజంగానే చదువు మాన్పించేస్తారేమోనని. అమ్మ కాళ్ళు పట్టుకుని. 'బుద్ధిగా చదూకుంటానమ్మా. బడి మాన్పించొద్దమ్మా' అని యేడ్చేశా. నిజానికి నా యేడుపు బడి మాన్పించేస్తారని కాదు - ఎక్కడ మగ్గంలోకి పెళ్ళాల్సొస్తుందోనని.

మొత్తానికి నా చేత బాగా చదుకుంటానని ఒట్టు వేయించుకుని బడికి మామూలుగా పంపిస్తానని వరమిచ్చింది అమ్మ. నాలుగైదు రోజులు ఇంటి పట్టునే వుండి చదువుకుంటా మళ్ళా ఒట్టు తీసి గట్టుమీద పెట్టి ఆటల్లో పడిపోయాననుకోండి. సరే - రోజులు ఇట్లా గడుస్తా వుంటే ఒకరోజు నేను మంచం మీంచి ఇంకా లేవక ముందే అమ్మ గొంతు గట్టిగా మోగింది. 'నువ్వయినా వెళ్ళి చెప్పు. వాడు వెళ్ళిపోతానంటున్నాడు.' అమ్మ అంత కంగారుతో మాట్లాడుతూ వుంటే దబిక్కున లేచా. అమ్మా నాన్నల మాటల వల్ల నాకు అర్థమైంది ఏందంటే మా మామ (అమ్మ తమ్ముడు) ఊరు వదిలి వెళ్ళిపోతున్నాడు. ఇక్కడ బతకలేక, నేత పని కాక ఇంకోపని వున్నవూళ్ళో చేయలేక నెల్లూరుకి పోయేందుకు బయల్దేరుతున్నాడు. మామ పోతున్నాడంటే నాకూ చాలా బాధ అన్పించింది. 'షావుకార్లు కూలీ (మజూరీ)లు తగ్గించి వేస్తే మాత్రం ఊరొదిలి వెళ్ళిపోడమేనా?' అంటున్నాడు నాన్న.

మామకి ఇద్దరు ఆడపిల్లలు. పెద్దది నాకంటే ఏడాది చిన్నదయితే, చిన్నది మూడేళ్ళు చిన్నది. అది పుట్టగానే నా పెళ్ళాం పుట్టిందని అందరూ అనుకున్నారంట. అదేంటో కానీ నాకు మాత్రం నా చెల్లికీ, దానికీ తేడా ఏం కనిపించేది కాదు. నా క్కోపం వస్తే నా చెల్లిని ఎట్లా కొట్టేవాణ్ణో నా మరదల్ని కూడా అట్టాగే కొట్టేవాణ్ణి. ఇప్పుడు పెళ్ళాన్నీ, పిల్లల్నీ పోషించడం మామకి కష్టమవుతున్నదంట. పొద్దున ఆరింటికి పోయి రేత్రి తొమ్మిది గంటల దాకా మగ్గం నేసినా నెలకి వెయ్యి రూపాయలే ముట్టేవి. రక్తాన్నంతా మగ్గం గుంటకి ధారపోస్తుండటంతో రోగాలు తప్పేవి కావు. ఆ రోగాలకీ, పిల్లల చదువులకీ, తిండికీ డబ్బు చాలక మళ్ళీ షావుకారు దగ్గరే అప్పు తేవడం, తర్వాత కూలీ ఇచ్చేప్పుడు షావుకారు అప్పులోంచి కొంత మినాయించుకుని ఇవ్వడం - ఇట్టా నేతగాడి బతుకు షావుకారు కింద వెట్టి బతుకులా అయిపోయింది. ఐతే అప్పుడు నా వయసుకి ఈ సంగతి అంత ఎరికలేదు కానీ కూలీలు తగ్గిస్తే బతకడం కష్టమనేది మాత్రం ఎరికే.

అమ్మ మాటలకి ఆఖరుకి నాన్న చొక్కా వేసుకుని బయటకి వెళ్ళాడు. మగ్గాలోకి వెళ్ళకుండా అమ్మ గుమ్మం వద్ద మెట్టుమీద కూర్చునింది. చెల్లి బిక్కుబిక్కుమంటూ వెళ్ళి అమ్మ ఒళ్ళోకి దూరింది. నేను కళ్ళు నులుముకుంటూ పుసిలు తీసుకుంటా అమ్మ కాడికి పోయి 'అమ్మా, మామ వూరెళ్ళిపోతే ఎట్టా. మరీ... అత్త, పాప, చిట్టి కూడా వెళ్ళిపోతారేమో' అనడిగా.

'నోరు ముయ్యరా భడవా' అని నా వంక చూస్తూ 'మన బతుకులు ఎట్టా అవుతాయో. మన రాత ఎట్టా వుందో. అందుకేగా చిన్నా నిన్ను బాగా చదూకొమ్మని చెప్పేది. ఈ కష్టం నువ్వు పడకూడదు. నువ్వు పెద్దయ్యి బాగా చదువుకొని మంచి వుద్యోగం సంపాయించుకోవాలి. అప్పుడు నువ్వే మమ్మల్ని పోషించాలి. తెల్సిందా' అనేసరికి నాకు చాలా ఆవేశొమొచ్చేసింది. 'అట్టాగే అమ్మా. నేను బాగా చదూకుని ఇంజనీర్నవుతానే. అప్పుడు మనకి బోలెడన్ని డబ్బులు వస్తాయి. చెల్లాయికి అప్పుడు మంచి మంచి గౌన్లు, బొమ్మలు కొనిపెడతానే' అన్నా.

అమ్మ గలగలా నవ్వేసింది. 'అరే భడవా. అప్పుడు చెల్లాయి కూడా పెద్దదయిపోద్ది కదరా. గౌన్లు, బొమ్మలు ఏం చేసుకుంటుంది' అమ్మ నవ్వు చూసేక నాకు హాయిగా అన్పించి నేను నవ్వా. మళ్ళా వెంటనే అమ్మ ముఖం అదోలా ఐపోయింది. మామ గురించి తలుచుకుని ఐవుంటుంది.

'ఈ షావుకార్లు తాము మాత్రం సుఖంగా, హాయిగా వుండాలనుకుంటా నష్టాన్నంతా నేతగాళ్ళ మీదే రుద్దేస్తున్నారు. కూలీలు ఎప్పుడు తగ్గుతాయో, ఎప్పుడు సక్రమంగా ఉంటాయో తెల్వకుండా పోతోంది. ఎంతకాలం ఈ రకం బతుకు వెళ్ళదీయాలో' అమ్మ తనకి తానే చెప్పుకుంటా వుంటే ఆమె ముఖంలోకి చూస్తా పక్కనే కూర్చున్నా.

ఆ ముందు రోజే పౌర్ణమి. అవ్వాళ నేతగాళ్ళకి సెలవు. ఎవరూ మగ్గంలోకి పోరు కానీ 'అల్లు'లు ఏమైనా సాచేదుంటే మాత్రం సాస్తారు. నేసిన తానులు తీసుకెళ్ళి షావుకారు కిచ్చి కూలీ (మజూరీ) డబ్బులు తీసుకుని కొత్త 'ఎంటి'లు తీసుకొచ్చుకుంటారు. అట్టాగే నిన్న వెళ్ళిన నేతగాళ్ళకి పిడుగులాంటి విషయం చెప్పారు షావుకార్లు. (ఈళ్ళనే మాస్టర్ వీవర్లు అంటారు) అదేమంటే - నూలు రేట్లు పెరిగిపోయాయి కాబట్టి కూలీ ధర మళ్ళీ తగ్గిస్తున్నామని. కూలీ చాలదనుకుంటే 'జాకార్డు' అనే రకం పెట్టుకోమన్నారు. అప్పుడు అక్కడ అంతా షర్టింగులు నేస్తున్నారు. ఇప్పుడు కూడా అదే నేసేటట్లయితే

కూలీలు తక్కువ తీసుకోవాలి. బయట సరుకుల ధరలు చూస్తే రోజురోజుకీ పెరుగుతా వుంటే బతకటమే కష్టంగా వుంది. అట్టాంటిది వున్న కూలీలు కూడా తగ్గిస్తే నేతగాడు ఇంక తినేదేంది. మట్టి తినాల్సిందే. లేదంటే 'జాకార్డు' రకం పెట్టుకోవాలి. అది కొత్తగా వచ్చింది. ఆ బట్టని ఇక్కడెవరూ కట్టుకోరు. ఇక్కణ్ణించి మద్రాసుకి పోయి మళ్ళా అక్కణ్ణించి ఆఫ్రికా దేశాలకి ఎగుమతయ్యి పోతుందంట. ఆ రకం పెట్టుకో వాలంటే వారం పది దినాలన్నా పడుతుంది. మళ్ళా దానికి పెట్టుబడి కావాలి.. రెండు మూడేల దాకా అవుతుందంట. అంత డబ్బు పెట్టేది కాక ఈ పది దినాలు నేత లేక ఆ నష్టమూ నేతగాడే భరాయించుకోవాలి. పెట్టుబడి నేతగాడి దగ్గిర లేక పోతే షావుకారే యిచ్చి 'ఆదుకుంటాడు' అప్పు యిచ్చి. ఇక ఆ అప్పు తీర్చేసరికి నేతగాడికి తాతలు దిగొస్తారు. షావుకార్లు యిట్టా నేతగాళ్ళని దోచుకుంటా మేడలు, మిద్దెలు కట్టు కుంటా, పొలాలకి పొలాలు కొనుక్కుంటా వుంటే నేతగాళ్ళు మాత్రం తిండి కోసమే అల్లాడిపోతా వుండారు. యింక పిల్లలకి చదువు చెప్పించేది యెక్కడ.

అంతదాకా అమ్మానాన్నలు ఏం కష్టపడిందీ నాకు తెల్వాదు. కష్టమంటే యేంటో కూడా నేనెరుగను. అమ్మ ఒళ్ళో పడుకుని ఆమె చెప్పే భారతం, రామాయణం కథలు వింటా నిద్రపోయే వాణ్ణి. అప్పుడే చాలామంది రచయితలు, కవుల గురించి చెప్పేది. అమ్మ చదువుకున్నది ఐదో క్లాసయినా ఎంత స్పీడుగా చదువుతుందో. నేతగాళ్ళ ఇంట్లో పుట్టినా అమ్మకి సాహిత్యం వాసన బాగా పట్టింది. ఎందుకంటే అమ్మ పుట్టింది దగ్గిర్నే 'జడ్.వి.' పెద్దనాన్న వాళ్ళు వుండేవాళ్ళు. ఆయన హైస్కూలులో మాస్టారు. నేను ఆరోక్లాసులో వున్నప్పుడు సోషల్ చెప్పే వాడు. మాకు దూరపు చుట్టం. ఆయన సాహిత్యాన్నంతా మథం చాడని చెప్పొచ్చు. అంతాచేసి రాయటమంటే ఆయనకెందుకో ఇష్టం లేదు. నేను పెద్దోన్ని ఐనాక ఆ సంగతే అడిగితే 'ఆ ఏం రాద్దాంలేవోయ్. నువ్వు రాస్తున్నావుగా చాల్లేరా' అనేవాడు. ఆయన నుంచి అమ్మకి ఆ వాసన తగిలింది. రేడియోలో కవితలు కూడా అమ్మవి వచ్చినాయంట కానీ అప్పటికి నాకింకా వూహ తెలీదు. నాకు ఈ ప్రపంచం తెల్వడం మొదలయినాక అమ్మ రాయడం మానేసింది. ఆమె తెలివీ, ఆమె చాకచక్యం అంతా సంసారానికే పరిమితమై పోయాయి. అమ్మ జీవితంలో ముప్పాతిక భాగం కష్టాల కడలిలోనే సాగింది. నాన్న చాలా మెతక. ఎవర్నీ పల్లెత్తు మాట అనేవాడు కాదు. షావుకారు వద్ద కూలీకి నేయకుండా సొంతంగా పెట్టుబడితో గుడ్డనేసి అమ్ముకుందామని అమ్మ ఎంత పోరు పెట్టినా నాన్న ధైర్యం చెయ్యలేదు. ఇప్పటికీ అంతే. సొంతంగా నేస్తే రేపు సరైన రేటు రాక పోతే ఎట్లా అని ఒకటి, రెండోదేంటంటే షావుకార్లకి బాకీ వుండటం. ఇందువల్ల అమ్మ ఎంత చెప్పినా నాన్న సొంతంగా నేసుకునేందుకు ఒప్పుకోలేదు. చెప్పీచెప్పీ విసిగిపోయి అమ్మ 'ఇంక చెప్పడం శుద్ధ దండగ' అని వూరుకుంది. అప్పుడే అమ్మ చెప్పినట్లు విని వుంటే అన్ని కష్టాలు వుండి వుండకపో వచ్చు అన్పిస్తుంది ఇప్పుడు.

అమ్మ లేస్తుంటే 'కూర్చోమ్మా' అని మారాం చేసింది చెల్లి, ఒళ్ళోంచి లేవకుండా. 'నాన్న పోయి చాలాసేపైంది. మీ మామ ఆయన మాట వింటాడో లేదో. వాడు వినడు. నా మాటే విన నోడు మీ నాన్న మాట వింటాడని అనుకోవడం బుద్ధి తక్కువ. మీరిక్కడే వుండండి. ఓసారి పోయి వస్తా' అని అమ్మ లేచింది, చెల్లిని పక్కకి జరిపి.

'అమ్మా, నేనూ వస్తానే' అన్నాను, అమ్మ చీర పట్టుకుని లాగుతూ. చెల్లయితే అమ్మ కాళ్ళని వాటేసుకుంది గట్టిగా.

'అబ్బబ్బా. ఇద్దరికిద్దరే పిడుగులు కదా. సరే తగలడండి' అంటా తలుపుకి గొళ్ళెం వేసింది.

అక్కడికి నాలుగిళ్ళవతలే మామ వాళ్ళిల్లు. నిజానికయితే మామ ఇక్కడికి వొచ్చి నాలుగేళ్ళే అయ్యింది. అంతకు ముందు పెడనలో వుండేవాడు. అక్కడ నేతగాళ్ళ బతుకులు మరీ అధ్వాన్నంగా వున్నాయని ఇక్కడికి వచ్చేశాడు. ఇప్పుడిక్కడా బతకడం చాలా కష్టమై పోయింది. 'నేతగాడి బతుక్కి భద్రత లేకుండా పోయినాక యెక్కడికి పోతే మాత్రం ఏ వొరుగుద్ది. ఎక్కడైనా నేతగాడి బతుకు ఒకటే' అన్న తాతయ్య మాటలు జ్ఞాపకానికొచ్చాయి. నేతగాళ్ళలో పదిమందికి ఒకడికి కూడా భూముల్లేవు. వున్నవాళ్ళకైనా ఒకట్రొండు ఎకరాలకి మించి లేవు. వేటపాలెం సైడు భూముల్లో ఎకరానికి 20 బస్తాలు వరి పండిందంటే ఎక్కువే. నేతగాడికి వున్న భూమిపై ధ్యాస పెట్టేది తక్కువ. ఎవరో ఒకరి మీద ఆధారపడాల్సిందే. లేదంటే కౌలుకి ఇచ్చుకోవాలి. యూరియాకీ, పొటాష్‌కీ, కూలోళ్ళకీ పోగా చూసుకుంటే వచ్చేది తక్కువే. మాకయితే ఈ పొలాల గొడవే లేదు, మగ్గం గొడవ తప్ప.

నాన్న పదో యేట నుంచే మగ్గం గుంటని కావలించేసుకున్నాడు. ఇప్పుడు నాన్నకి ముప్పై నాలుగేళ్ళు. నేత తప్ప ఇంకో పని తెలీదు. అమ్మయినా అంతే. నాన్నతో సమానంగా నేస్తుంది, ఓ పక్క ఇంటి పనీ, మా ఇద్దరి పిల్లల పనీ చేస్తూనే. అంటే నాన్న చేసే దానికంటే అమ్మ చాకిరీనే యెక్కువ. రెండేళ్ళ క్రితం వేట

'పోరా వెంకా. పొయ్యి నువ్వయినా బాగుపడు. షావుకార్లని ఎదిరించే దమ్ము మనోళ్ళకి ఇప్పుడు కనపడ్డంలేదు. ఆళ్ళ రాజ్యం నడుస్తున్నంత కాలం మనోళ్ళకి ఈ తిప్పలు తప్పవు. మీ బావకి నీకున్నంత తెగింపు లేదులే. మా బతుకులు ఇట్టానే ఏడ్వాలి. మనకి మంచి రోజులు వచ్చాయని తెలుసుకున్నప్పుడు రావాలనుకుంటే వొచ్చెయ్యి. ఇప్పుడైతే నువ్వెళ్ళడమే రైటనిపిస్తంది'

పాలెం చుట్టుపక్కల మగ్గాల వాడల్లో పెద్ద అలజడి రేగింది. నేతగాళ్ళు కూలీలు పెంచాలని ఉద్యమం చేశారు. చేనేత కార్మిక సంక్షేమ సంఘం దానికి నాయకత్వం వహించింది. కానీ షావుకార్లు తగ్గించిన కూలీలు పెంచేదే లేదని మొండికేశారు. నేతగాళ్ళు వెనక్కి తగ్గలేదు. చేనేత సంఘం నేతగాళ్ళల్లో చైతన్యాన్నీ, ధైర్యాన్నీ కల్గించడానికి చాలా శ్రమ పడింది. అప్పుడే వాడ, ఏ పేట చూసినా సభలూ, వాటితోపాటు చేనేత దీనస్థితిపై పాటలూ, నాటికలూ. వారం రోజులు మగ్గాలు ఆడలేదు. నేతగాళ్ళ దగ్గిర డబ్బులయిపోయాయి. రోజుకో పూట మాత్రమే తిండి వుండే స్థితికొచ్చింది. ఈ గొడవలోకి గవర్నమెంటు తల దూర్చిందంటే మొదటికే నష్టం వస్తుందనుకున్న మాస్టర్ వీవర్లు చేనేత సంఘానికి కబురు పెట్టారు: కూలీలు పెంచుతున్నట్లు మీటింగు పెట్టి చెప్పారు. నేతగాళ్ళంతా పండగ చేసుకున్నారు. రెండేళ్ళు గడిచాయి. అప్పటి స్థితి మళ్ళా వొచ్చింది. కూలీలు మళ్ళా తగ్గాయి. చేనేత సంక్షేమ సంఘం మళ్ళా రంగం మీదికొచ్చింది. మాటిమాటికీ షావుకార్లు కూలీలు తగ్గించకుండా శాశ్వత పరిష్కారం కోసం పోరాటం మొదలుపెట్టింది. ఏ రకం వస్త్రానికైనా డిమాండ్ తగ్గితే, నేతగాళ్ళకి ఇంకో ప్రత్యామ్నాయ రకం చూపాలని డిమాండ్ చేసింది. ఐతే ఈసారి మాస్టర్ వీవర్లు నేతగాళ్ళలో చీలికలు తెచ్చి అంతా ఏకమవ్వకుండా జాగ్రత్తపడ్డారు. సంఘం ఇచ్చిన 'మగ్గాల బంద్' పిలుపుని ఖాతరు చెయ్యకుండా చాలామంది నేతగాళ్ళు మగ్గాల్ని ఆడించారు. సంఘం మాటలు నమ్మితే నష్టపోయేది మీరేనని, తిండి కోసం మలమలా మాడాల్సి వొస్తుందని, మాకు ఈ వ్యాపారం కాకపోతే ఇంకోటి దొరుకుతుందని' షావుకార్లు చాపకింద నీరులా ప్రచారం చేసి నేతగాళ్ళ గుండె ధైర్యం తగ్గిపోయేలా చేశారు. దాంతో చేనేత సంఘం ఎంత ప్రయత్నం చేసినా కూలీలు పెరగలేదు. తగ్గిన కూలీ రేట్లకే గుడ్డని నేస్తూ రావడంతో నేతగాళ్ళ ఆర్థిక స్థితి దిగజారిపోయింది. షావుకార్ల వద్ద బాకీ కొండలా పెరిగిపోతోంది. నేతగాళ్ళ ఇళ్ళల్లో ఏ శుభకార్యం వచ్చినా, పండుగలకీ, పబ్బాలకీ అప్పులు చెయ్యడం మామూలయిపోయింది. దీనికి తోడు నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటేంతగా పెరుగుతూ వచ్చాయి. ఇప్పుడు మళ్ళా రంగులు, రసాయనాల ధరలు పెరిగిపోయాయనే వొంకతో షావుకార్లు ఇంతకు ముందే తగ్గించిన కూలీల్ని ఇంకా తగ్గించారు. లేదంటే 'జాకార్డు' రకం పెట్టుకోమని తేల్చి చెప్పారు. జాకార్డుకి గిరాకీ బాగానే ఉంది. ఐతే అది నెయ్యడంవల్ల కీళ్ళనొప్పులు ఎక్కువవుతాయి. కాళ్ళ కింద బరువు చాలా ఎక్కువగా ఉంటుంది 'జాకార్డు'ని పెడితే. డబ్బులు బాగానే వస్తాయి కానీ రోగాలకే ఆ వచ్చే డబ్బు సరిపోతుంది. పైగా పెట్టుబడి కావాలయ్యే. దంతా ఆలోచించే అయ్యుంటుంది మామ ఇక్కణ్ణించి ఎట్లైనా యెళ్ళిపోవాలనుకుంటున్నది.

మేం యెళ్ళేసరికి మామకీ, నాన్నకీ మాటలు సాగుతున్నాయి. అత్తేమో కన్నీళ్ళు పెట్టుకుంటా వుంటే పాప, చిట్టి బిక్కముఖాలు వేస్కుని చూస్తున్నారు.

'బావా యింక నా వల్ల కాదు. నువ్వేన్నయినా చెప్పు. ఇక్కడ వుండి ఈ పనే చేసేటట్టయితే నేనూ, మీ చెల్లెలు ఉరేసుకోవాల్సిందే. ఇప్పటికే పదేలయ్యింది. షావుకారు దగ్గర బాకీ. ఇంకా పెంచుకుని తీర్చలేక యాతన పడేకంటే ఇంకేదైనా పన్జూసుకోవడం నయం' అంటూనే అత్తతో 'కానీవే. ఆ ఏడ్పెందుకు. మనకి ఇద్దరు ఆడపిల్లలున్నారు. వాళ్ళని ఇంకొకళ్ళ చేతుల్లో పెట్టాలంటే ఇక్కడ వుంటే అయ్యే పని కాదు. తొందరగా రెడీ ఇవ్వు' అంటున్నాడు.

'వెంకటేశూ... ఇట్లా బెంబేలైపోతే యెట్లా. మేం వుండట్లేదా. మనకీ మంచి రోజులు రాకుండా పోవు. యింతదాకా కూడుపెట్టిన మా వృత్తి ఇక ముందు పెట్టకుండా వుంటుందా. కొంచెం ఓపిక పట్టవయ్యా. అంతేకానీ యిట్టా వెళ్ళిపోయి ఏం పని చేద్దామని. నీకేం వొచ్చని' అన్నాడు నాన్న.

'ఇదే పని చెయ్యడం నా వల్ల కాదు బావా. మనం 'ఈ పని తప్ప ఇంకో పని మనవల్ల కాదు' అనుకుంటా వుండబట్టే ఈ షావుకార్లు మనల్ని యిట్టా ఆడిస్తా వున్నారు. మనం ఆడుతున్నాం. నెల్లూరుకి పోతే తెలిసినోళ్ళు వున్నారు. చేపల చెరువులు చూసుకొమ్మని చెబుతున్నారు. వొకేళ ఆ పని లేకపోతే పొలం పనికెళ్ళయినా నా వోళ్ళని పోషించుకుంటా' తెగేసి చెప్పాడు మామ.

నాన్నకి ఏం చెప్పాలో ఇంక తెల్వక అమ్మ వొంక చూశాడు.

అమ్మ అంది కదా. 'పోరా వెంకా. పొయ్యి నువ్వయినా బాగుపడు. షావుకార్లని ఎదిరించే దమ్ము మనోళ్ళకి ఇప్పుడు కనపడ్డం లేదు. ఆళ్ళ రాజ్యం నడుస్తున్నంత కాలం మనోళ్ళకి ఈ తిప్పలు తప్పవు. మీ బావకి నీకున్నంత తెగింపు లేదులే. మా బతుకులు ఇట్టానే ఏడ్వాలి. మనకి మంచి రోజులు వచ్చాయని తెలుసుకున్నప్పుడు రావాలనుకుంటే వొచ్చెయ్యి. ఇప్పుడైతే నువ్వెళ్ళడమే రైటనిపిస్తంది'

నాకయితే అమ్మ మాటలకి చాలా రోషమొచ్చేసింది. అమ్మ కొంగు పట్టుకుని వూపుతా ఇంకో చేత్తో పిడికిలి బిగించి 'అమ్మా, పెద్దయ్యాక నేను షావుకార్లని ఎదిరిస్తానే. అప్పుడు మనోళ్ళ రాజ్యమే వొస్తుందే' అని మామ వొంక తల తిప్పి 'మామా! అప్పుడు వొద్దువుగానిలే నువ్వు అత్తనీ, చిట్టినీ, పాపనీ తీస్కుని' అన్నాను ఆవేశంగా. అట్టాంటి సందర్భంలోనూ నవ్వు వచ్చేసింది మామకి. నవ్వుతా 'అట్టాగేలేరా. ఆ రోజొత్తే కచ్చితంగా వొస్తాంలే' అన్నాడు. ★